నమస్తే తెలంగాణ

# సూర్యాపేట






నల్లగొండ కలెక్టరేట్‌లో పూర్తయిన ఏర్పాట్లు

# నేటి నుంచి నామినేషన్లు

## పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

- ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- 26న పరిశీలన, 29న అభ్యర్థుల తుది జాబితా
- వచ్చే నెల 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్
- కట్టుదిట్టమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్17(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు కౌంట్ డౌన్ మొదలైంది. ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ప్రక్రియ నేటితో మొదలు కానుంది. గురువారం ఉదయం 11గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. ఆ తదుపరి నామినేషన్ల స్వీకరణకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రభుత్వ పనిదినాల్లో ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల దాఖలు చేయవచ్చు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. 26న నామినేషన్ల పరిశీలన పూర్తి చేస్తారు. 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా వెల్లడించనున్నారు. ఇక వచ్చే నెల 13న పోలింగ్ జరుగనుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అభ్యర్థుల తుది జాబితా అనంతరం సరిగ్గా 12 రోజుల గడువే ప్రచారానికి మిగిలి ఉండనుంది.

ఉమ్మడి జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాలకు నేటి నుంచి నామినేషన్ల దాఖలు కానున్నాయి. నల్లగొండకు సంబంధించి నల్లగొండ కలెక్టరేట్‌లో, భువనగిరికి సంబంధించి భువనగిరి కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ రెండు జిల్లా కలెక్టర్లు ఆయా నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. వారి ఆధ్వర్యంలోనే నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. నామినేషన్ల స్వీకరణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు.

### నామినేషన్ల దాఖలుకు నిబంధనలు ఇలా..

- పోటీ చేసే అభ్యర్థి భారతీయుడైన ఓటరు అయి ఉండి కనీస వయస్సు 25 సంవత్సరాలు కలిగి ఉండాలి.
- ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల వరకు నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు.
- పోటీ చేసే అభ్యర్థులు జనరల్ అయితే 25 వేల రూపాయల సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించాలి.
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ తో పాటు, కుల ధ్రువీకరణ పత్రాలు జతచేయాలి.
- గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల అభ్యర్థులను ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది.
- గుర్తింపు లేని రాజకీయ పార్టీల అభ్యర్థులు లేదా స్వతంత్ర అభ్యర్థులను అదే నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- నామినేషన్ పత్రాలతో పాటు ఫామ్-26 ద్వారా ఆఫిడవిట్ దాఖలు తప్పనిసరి. ఈ అఫిడవిట్‌లో విద్యార్హతలు, కేసులు , క్రిమినల్ యాంటిసిడెన్స్ తప్పనిసరిగా పొందుపర్చాలి.
- అభ్యర్థి పోటీ చేసే స్థానం కాకుండా వేరే నియోజకవర్గం ఓటరైతే సంబంధిత రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది.
- నామినేషన్ దాఖలుకు ముందే ఎన్నికల ఖర్చు నిర్వహణ కోసం ఏదేని జాతీయ బ్యాంకులో ప్రత్యేకంగా ఖాతా తెరవాలి. ఆ వివరాలను సమర్పించాలి.
- నామినేషన్ల దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలో ఇతరులకు అనుమతి ఉండదు.
- నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు మరో నలుగురు వ్యక్తులను, మొత్తం మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.
- నామినేషన్ దాఖలు సమయంలో ర్యాలీలు, మీటింగ్‌లకు ఆన్‌లైన్‌లో అయితే సువిధా యాప్ ద్వారా ఆఫ్‌లైన్‌లో అయితే సంబంధిత ఏఆర్‌ఓ కార్యాలయాల్లో అనుమతి తప్పనిసరి.


### పటిష్ట బందోబస్తు : ఎస్పీ చందనాదీప్తి

నేటి నుంచి మొదలవనున్న నామినేషన్ల స్వీకరణకు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ చందన దీప్తి తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సెంట్రల్ ఫోర్స్, ఆర్డ్మ్ ఫోర్స్, సివిల్ బలగాలు విధుల్లో ఉంటాయని వెల్లడించారు. ఆర్‌ఓ కార్యాలయానికి 100 మీటర్ల లోపలకి అభ్యర్థితోపాటు మరో నలుగురికి, మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.


సూర్యాపేటలో రాములోరి కల్యాణంలో కుటుంబ సభ్యులతో పాల్గొన్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ

## రమణీయం రాములోరి కల్యాణం

శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆలయాలతోపాటు పలుచోట్ల సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తరించారు. వేద మంత్రాలు, భక్తిపాటలతో ఆధ్యాత్మిక సందడి కనిపించింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు పలుచోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు.


నల్లగొండలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


బుధవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్

# దంచికొడుతున్న ఎండ

- దంచికొడుతున్న ఎండలు
- నిడమనూరులో అత్యధికంగా 44.8 డిగ్రీలు
- ఇండ్లకే పరిమితమవుతున్న జనం

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 17 : ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నది. నల్లగొండ జిల్లాలో బుధవారం 44.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. నిడమనూరులో గరిష్ఠంగా 44.8 డిగ్రీలు, నాంపల్లిలో 44.7, దామరచర్లలో 44.6, మునుగోడులో 44.5, అనుములలో 44.4, తిరుమలగిరి సాగర్, మాడ్గులపల్లిలో 44.3, మిర్యాలగూడ, చందంపేటలో 44, అత్యల్పంగా చింతపల్లిలో 39 డిగ్రీలు రికార్డయ్యాయి. ఏడు మండలాల్లో 44 డిగ్రీలకుపైగా, 12 మండలాల్లో 43 డిగ్రీలు, తొమ్మిది మండలాల్లో 42 డిగ్రీలు, మిగిలిన మండలాల్లో 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లాలోనూ 44 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం మునగాలలో అత్యధికంగా 44.7 డిగ్రీలు, సూర్యాపేటలో 42 డిగ్రీలు రికార్డయ్యింది. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు ఎండ వేడిమికి తాళలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

ఉదయం తొమ్మిది గంటల నుండే ఎండ ప్రభావం కనిపిస్తుండడంతో ప్రజలు బయటికి రావాలంటే జంకుతున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా 33 నుంచి 37 డిగ్రీల వరకు నమోదవుతుండడంతో ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్యాన్, కూలర్లు లేకుండా ఇండ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. వడగాలులతో ప్రజలు మధ్యాహ్నం వేళ బయటికి వెళ్లడం లేదు. దాంతో రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

# ఇంటి దారిన గురుకుల విద్యార్థులు

## ఆందోళనలో తల్లిదండ్రులు

- గురుకులాలు, హాస్టళ్లంటేనే జంకుతున్న వైనం
- జిల్లాలో ఇద్దరి ఆత్మహత్యలు మరుకముందే మరో విద్యార్థి మృతి
- యాజమాన్య నిర్లక్ష్యం, ప్రభుత్వ అలసత్వమే కారణమంటున్న తల్లిదండ్రులు
- భువనగిరి గురుకులంలో విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స
- ప్రశాంత్ మృతి కలిచివేసింది : ఎక్స్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 17 : జిల్లాలోని భువనగిరి ఎస్సీ వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యలు మరువకముందే పట్టణ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మరో విద్యార్థి మృతి చెందాడు. కేవలం బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, వసతి గృహాల్లోనే మృతి చెందుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందడంతోపాటు విద్యార్థులను అక్కడ ఉంచాలంటేనే జంకుతున్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో అపరిశుభ్రంగా వంట గదులు, బోరు నీటి వాడకం, వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు అందుబాటులో ఉండకపోవడం, వంటలను ఇష్టానుసారంగా చేస్తుండడం ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయని తేటతెల్లమైంది. గతంలోనూ ప్రభుత్వ వసతి గృహాల్లో సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థుల ప్రాణాలు బలిగొన్నారు. మౌలిక వసతులు లేకపోవడం, విద్యార్థుల బాగోగులు సరిగా చూసుకోకపోవడం, సరైన భోజనం పెట్టకపోవడం, ఆరోగ్యం గురించి పట్టించుకునేవారు లేక బయటి వ్యక్తులపై ఆధారపడడం, యాజమాన్యం బయటి వ్యక్తులకు అప్పగించడంతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నైపుణ్యం లేని సిబ్బందితో వంటలు చేయించడంతో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో కలుషిత ఆహారం కారణంగా బొమ్మలరామారం, గుండాల, భువనగిరి, వలిగొండ, మోటకొండూరు వసతి గృహాల్లోనూ ఫుడ్ పాయిజన్ కేసులు నమోదయ్యాయి.


హాస్టల్ నుంచి విద్యార్థులను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు


భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

### ఫుడ్ పాయిజన్‌తో నిండు ప్రాణం బలి..

భువనగిరిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో యాజమాన్యం నిర్లక్ష్యంతో ఫుడ్ పాయిజన్‌తో ఓ విద్యార్థి బలయ్యాడు. ఈ నెల 11న విద్యార్థులకు కలుషిత ఆహారం పెట్టగా అది తిన్న విద్యార్థులు సుమారు 40 మంది అస్వస్థతకు గురయ్యారు. అందులో 25 మంది తీవ్ర అస్వస్థతకు గురికాగా యాజమాన్యం నిర్లక్ష్యంతో గుట్టుచప్పుడు కాకుండా పాఠశాలలోనే వైద్యాధికారుల సాయంతో తల్లిదండ్రులకు చెప్పకుండా రెండు రోజులు చికిత్స చేయించారు. సరైన చికిత్స అందకపోవడంతో 10 మంది పరిస్థితి విషమించింది. వీరిలో ఆరుగురిని భువనగిరి ఏరియా దవాఖానకు, నలుగురిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానాకు తరలించి చికిత్స చేయించారు. కానీ, రెయిన్‌బో దవాఖానలో చికిత్స పొందుతూ సీహెచ్ ప్రశాంత్ అనే విద్యార్థి ఈ నెల 16న మృతి చెందాడు. భువనగిరి ఏరియా దవాఖానలో మరో ఐదుగురు, గురుకుల పాఠశాలలో ఆరుగురికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇందుకు పూర్తి బాధ్యత పాఠశాల యాజమాన్యానిదేనని, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే ఇంతమంది అస్వస్థతకు గురయ్యారని, ఒక విద్యార్థి మృతి చెందడంతో ప్రభుత్వం పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసింది. ఓ కమిటీని ఏర్పాటు చేసి జరిగిన ఘటనపై నివేదిక అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

### అరకొర వసతులు..

గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై కోలుకున్న విద్యార్థులతోపాటు ఇతర విద్యార్థులు ఇండ్లకు వెళ్లిపోతున్నారు. పాఠశాలలో అరకొర వసతులు ఉన్నాయని, రాత్రివేళ విరేచనాలు అయితే ఇబ్బంది అవుతుందని, మరుగుదొడ్లు దూరంగా ఉన్నాయని చెబుతున్నారు. ఇబ్బందులు కలిగినప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

### ఎస్ఎఫ్ఐ, బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా..

ఫుడ్ పాయిజన్‌తో ఎంతోమంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఇబ్బందిపడడంతోపాటు మంగళవారం మృతి చెందిన ప్రశాంత్ అనే విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి బుధవారం హాస్టల్ ముందు ధర్నా నిర్వహించారు. అలాగే బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలోనూ ధర్నా చేపట్టి ఇది ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరిగిన సంఘటనగా పేర్కొన్నారు.

## హాస్టల్ విద్యార్థి ప్రశాంత్‌కు అంతిమ వీడ్కోలు

భూదాన్‌పోచంపల్లి : భువనగిరిలోని బాలుర గురుకుల హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన భూదాన్ పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లికి చెందిన విద్యార్థి చిన్నలచ్చి ప్రశాంత్(12) అంత్యక్రియలు బుధవారం సాయంత్రం నిర్వహించారు. మంగళవారం రాత్రి మృతి చెందిన ప్రశాంత్ మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బుధవారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చారు. రాత్రి 7గంటల సమయంలో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనల నడుమ ప్రశాంత్ అంత్యక్రియలను పూర్తి చేశారు.


జిబ్లక్‌పల్లిలో ప్రశాంత్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

## మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిపై కేసు

- అక్రమాలకు పాల్పడిన మరొకరిపై నాన్ బెయిలబుల్ కేసు
- మిల్లుల ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసమే కారణం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం పారాబాయిల్డ్ రైస్ మిల్లులకు కేటాయిస్తే ఆ ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. అక్రమాల్లో భాగస్వామ్యమైన సూర్యాపేట జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్యతోపాటు కోదాడకు చెందిన నీలా సత్యనారాయణపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చివ్వెంల మండలం వల్లభాపురం వద్ద ఉన్న జగన్మాత పారాబాయిల్డ్ రైస్ మిల్లులో స్టాక్ సరిగా ఉండడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపారు. సోమ నర్సయ్యకు చెందిన తిరుమలగిరి మండలంలోని సంతోష్ రైస్ మిల్లులో గత మూడు సీజన్‌లకు చెందిన రూ.90 కోట్ల విలువ చేసే 41,365 మెట్రిక్ టన్నుల ధాన్యం, కోదాడ మండలం కొమరబండ వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీలో రూ.64 కోట్ల విలువ చేసే 29,093 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారని చెప్పారు. దాంతో సంతోష్ రైస్ మిల్లు యజమాని, జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సోమనర్సయ్యతోపాటు శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీ యజమాని నీలా సత్యనారాయణపై అధికారుల ఫిర్యాదుల మేరకు 406, 409, 420, 120బి,109 ఐసీసీ సెక్షన్ ఆఫ్ ఈసీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో కొన్ని నాన్‌బెయిలబుల్ సెక్షన్లు ఉన్నాయన్నారు.

### తనిఖీలు చేసినా బయటకు రాని సమాచారం?


నాగారం మండలం ఈటూరు వద్ద ఉన్న రఘురామ పారాబాయిల్డ్ రైస్ మిల్లులో సైతం 15 నుంచి 20 మంది అధికారులు, సిబ్బంది తనిఖీలు చేపటినట్లు సమాచారం. కానీ వాటిలో ఏమైనా అక్రమాలు జరిగాయా, ధాన్యం నిల్వలు ఉన్నాయా? అని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారితోపాటు ఇతర అధికారులను సంప్రదించినా తమకు తెలియదని చెప్పడం గమనార్హం. కొద్ది సంవత్సరాలుగా రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యాన్ని ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం ఆయా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి కేటాయిస్తూ వస్తున్నది. సూర్యాపేట జిల్లాలో గత రెండు సీజన్ల నుంచి ధాన్యం తీసుకొని ఒక్క కిలో కూడా సీఎంఆర్ ఇవ్వని మిల్లులు 6 ఉన్నాయి. వీటితోపాటు గతంలో సకాలంలో రైస్ ఇవ్వక డిఫాల్ట్ అయిన మిల్లులు 32 ఉన్నాయి. రెండు రోజులుగా జిల్లాలోని అలాంటి నాలుగు మిల్లులపై అధికారులు తనిఖీలు చేపట్టి రెండింటిపై కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉంటే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి రెండు మిల్లులు ఉండడం, రెండింటిలోనూ కేటాయించిన ధాన్యం లేనట్లు తెలిసింది. దాంతో రెండు మిల్లులు సీజ్ కాకుండా ఒక మిల్లులోని స్టాక్‌ను మరో మిల్లులో చూపిస్తున్నట్లు సమాచారం.

# బీఆర్‌ఎస్‌లో సమరోత్సాహం

- ఎన్నికలకు పూర్తి స్థాయితో సన్నద్ధత
- అవకాశవాదులు పార్టీని వీడడమే మంచిదంటున్న క్యాడర్
- మరింత పట్టుదలతో క్షేత్రస్థాయి శ్రేణులు
- సన్నాహక సమావేశాల్లో కొట్టొచ్చిన ఆత్మవిశ్వాసం
- పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యమని ప్రతిజ్ఞలు
- మరింత సమన్వయంతో నాగార్జునసాగర్ నేతలు
- హుజూర్‌నగర్‌లోనూ బీఆర్‌ఎస్ సత్తా చాటుతామంటున్న శ్రేణులు
- నేడు కేసీఆర్ చేతుల మీదుగా బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఫామ్‌లు

**లోక్‌సభ ఎన్నికల్లో అటు నల్లగొండ, ఇటు భువనగిరి నియోజకవర్గాల్లో సత్తా చాటేందుకు బీఆర్‌ఎస్ పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా పార్టీ క్యాడర్‌తో సన్నాహక సమావేశాలు పూర్తి చేసి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలుకానుండడంతో ప్రచారాన్ని కూడా విస్తృతం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రకటించిన పార్టీ అభ్యర్థులు క్యామ మల్లేశ్‌యాదవ్, కంచర్ల కృష్ణారెడ్డికి గురువారం పార్టీ అధినేత కేసీఆర్ తెలంగాణ భవన్‌లో బీఫామ్‌లు అందించనున్నారు. ఇదే సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎజెండా, ప్రచార సరళి తదితర అంశాలపై పార్టీ ముఖ్యులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.**

*– నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ)*



అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లకు మరోసారి తావివ్వకుండా లోక్‌సభ ఎన్నికలపై బీఆర్‌ఎస్ దృష్టి సారించింది. అందుకు అనుగుణంగా ఇప్పటికే భువనగిరి నుంచి క్యామ మల్లేశ్, నల్లగొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించింది. దీంతో ఆయా నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల వారీగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు కూడా పూర్తి చేసింది. ఈ సమావేశాలకు పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. అక్కడక్కడ కొందరు అవకాశవాద నేతలు పార్టీని వీడుతున్నా సమావేశాల సందర్భంగా ఆ ప్రభావం ఎక్కడా కనిపించ లేదు. ఇంటి దొంగలు బయటకు వెళ్లిపోవడమే పార్టీకి మేలు చేస్తుందంటూ కార్యకర్తలు స్పష్టం చేశారు. అధికారం కోసం వచ్చిన నేతలు మళ్లా అధికారం కోసమే వెళ్లిపోయారని, వీరితో పార్టీకి వచ్చిన నష్టమేమీలేదని క్యాడర్ సమావేశాల్లో బహిరంగంగానే ప్రకటించారు. సమావేశాలకు హాజరైన పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో కనిపించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడా పార్టీ చెక్కు చెదరలేదని, ప్రజల్లోనూ మరింత ఆదరణ పెరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు, కరువు, సాగు, తాగునీటి ఎద్దడి, రైతు బంధు నిలుపుదల, కరెంటు కోతలు తదితర అంశాలే అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు భారీగా ఓట్లు పోలయ్యేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పలుచోట్ల ప్రతిజ్ఞలు సైతం చేయడం విశేషం. ఈ సమావేశాల్లో పార్టీ ముఖ్యుల ప్రసంగాలకు సైతం శ్రేణుల నుంచి భారీ స్పందన వ్యక్తమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోగొట్టుకున్న ఓట్లను తిరిగి లోక్‌సభ ఎన్నికల్లో రాబట్టుకుంటామన్న ధీమా పార్టీ శ్రేణుల్లో వ్యక్తమైంది.

### సాగర్‌లో మరింత సమన్వయంతో...

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పార్టీ నేతలు మరింత సమన్వయంతో ముందుకు సాగేందుకు సిద్ధమయ్యారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఏకతాటిపై పార్టీని నడిపిస్తామని ప్రకటించారు. మంగళవారం హాలియాలో జరిగిన సమావేశంలో ఇద్దరు నేతలు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఒక్కటిగా కలిసి పని చేస్తామంటూ పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపారు. వేదికపై ఉన్న ఇతర ముఖ్య నేతలు సైతం అందరం కలిసికట్టుగా పని చేద్దామని సూచించారు. ఇప్పటికే గతంలో పార్టీకి నష్టం కలిగించిన కొందరు అవకాశవాదులు పార్టీని వీడారని, అసలైన నేతలే పార్టీలో ఉన్నారంటూ అందరం సమన్వయంతో నియోజకవర్గంలో మంచి మెజార్టీని సాధిస్తామని ప్రకటించారు. దీంతో సమావేశానికి హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సైతం చప్పట్లు, ఈలలు, కేరింతలతో సమ్మతిని తెలిపారు. సమావేశం ఆసాంతం మంచి జోష్‌లో కొనసాగడం విశేషం.

### మరింత పట్టుదలతో హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పార్టీని వీడి బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆగ్రహంతో ఉన్నాయి. తన వెంట రావాలని పార్టీ నేతలు, కార్యకర్తలను సైదిరెడ్డి ఎంత ఒత్తిడి చేసినా ఎవరూ పట్టించుకోలేదు. మంత్రి ఉత్తమ్‌కు వ్యతిరేకంగా పోరాటం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమంటూ పార్టీలోనే కొనసాగేందుకు మరింత పట్టుదలతో ఉన్నారు. కాంగ్రెస్ అరాచకాలు, మోసాలపై బీఆర్‌ఎస్ వేదికగానే పోరాడతామని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరయ్యారు. మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు ఇతర నేతలు దిశానిర్దేశం చేయగా పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు దీటుగా ఓట్లు సాధించి సత్తా చాటుదామని ప్రతినబూనారు.

### ఆత్మవిశ్వాసంతో ముందుకు

ఇతర నియోజకవర్గాల్లో సైతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పునరావృతం కాకుండా భారీగా ఓట్లను సాధిస్తామన్న ఆత్మవిశ్వాసంతో పార్టీ నేతలు, క్యాడర్‌లో కనిపించింది. కాంగ్రెస్ మాయమాటలకు ప్రజలు పడిపోయారని, ఇప్పుడు పరిస్థితి అలా లేదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. కండ్ల ముందే కాంగ్రెస్ మోసాలు కనిపిస్తున్నాయని, ఈ మోసాలే ఎన్నికల అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. నాటి కేసీఆర్ పాలనను గుర్తు చేస్తూ... నేటి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలన్న పట్టుదలతో పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి.